డ్రగ్స్ వింగ్ డైరెక్టర్ రామ్‌ధన్‌కు అభినందన సత్కారం



దశ, హైదరాబాద్: తెలంగాణ ఆహార మరియు అత్యవసర ఔషధ ప్రమాణాల ప్రాధికార సంస్థ డ్రగ్స్ వింగ్ డైరెక్టర్‌గా నియమితులైన శ్రీ జి. రామ్‌ధన్‌ను గ్రేటర్ హైదరాబాద్ రెసిడెంట్ మెడికల్ సేల్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. తెలంగాణలో ఔషధ భద్రత, నియంత్రణ వ్యవస్థ మరియు ప్రజారోగ్య పరిరక్షణలో ఇది ఒక గర్వించదగ్గ మైలురాయి అని కొనియాడారు. రామ్‌ధన్ గారి నాయకత్వం, సుదీర్ఘ అనుభవంతో రాష్ట్రంలో ఔషధ నియంత్రణ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన తన నూతన బాధ్యతల్లో ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కిషన్ మురారిశెట్టి, లక్ష్మణ్ వనమాల, సుభాష్ గౌడ్, కృష్ణ కుమార్, రాజేందర్ గగడ్, లలిత్ భాయ్, శ్రీనివాస్, సురేష్, విశ్వకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తులు కలసికట్టుగా వన జాతర



దశ, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం దుబ్బాక గ్రామంలో గత కొంతకాలంగా వరస మరణాలు జరుగుతుండడంతో గ్రామస్తులు కలసికట్టుగా ఏక నిర్ణయంతో గ్రామము సుభిక్షంగా ఉండాలంటే గ్రామంలోని ప్రజలు ఎలాంటి అనారోగ్యాలకు గురికాకుండా ఆరోగ్యంగా ఉండాలని ఒక రోజు ఊరు విడిచి వనవాసం వెళ్లాలని అడవిలో చెట్ల కింద బంధుమిత్రులు కుటుంబ సమేతంగా భోజనాలు చేయాలని కలసికట్టుగా ఊరు విడిచి ఒక పండగ వాతావరణం తలపించేలా గ్రామస్తులు వనవాసం వెళ్లడం జరిగింది, ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, మా గ్రామంలోని ప్రజలందరూ పాడిపంటలు పశుసంపద పిల్లలు ఆయురారోగ్యాలతో ఉండాలనే,సంకల్పంతో వనవాసం వెళ్ళామని ఈ సందర్భంగా అన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు క్రిష్ణవేణి విద్యార్థులు



దశ, రామన్నపేట: రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలోని క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ కు చెందిన పలువురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల కరెస్పాండెంట్ గంగుల నరేందర్ రెడ్డి తెలిపారు. 28,29 తేదీలలో నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియం లో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి హాకీ పోటీలలో పాల్గొని అండర్ 14, విభాగంలో ఎస్.ప్రణీత, వి. మానస, ఎం. శరణ్య, పి.అమరనాథ్, అండర్ 17 విభాగంలో పి. నిషిత, ఎస్. అక్షిత, పి. నితిన్ ఎంపికైనట్లు ఆయన తెలిపారు. జిల్లా స్థాయి పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను, పి ఈ టి కల్పన ను కరస్పాండెంట్ తో పాటు ప్రిన్సిపాల్ బి. సురేష్, అకాడమిక్ డైరెక్టర్ జె వి ఎన్ ఎస్ మణి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

నాచారం డివిజన్‌లో అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం: నూతలకంటి రాజు



దశ ఓయూ: ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు నాచారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు నూతలకంటి రాజు ఆధ్వర్యంలో డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం పరిశీలించారు. బాబానగర్, రామ్‌రెడ్డి కాలనీ, హనుమాన్‌నగర్ ప్రాంతాల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల పురోగతిని పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలకు సంబంధించిన సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని నూతలకంటి రాజు తెలిపారు. డివిజన్ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌గౌడ్, సంతోష్‌రెడ్డి, సేవాదళ్ వెంకటేశ్, సునీల్‌రెడ్డి, బండారి రఘు, ఫసియుద్దీన్, గద్ద క్రాంతికిషోర్, శ్రీమంత్‌గౌడ్, అబ్రహం, బాలరాజు, తస్లీం, శంకర్‌గౌడ్, శ్రీధర్, హనీఫ్, జాఫర్, జావేద్, రాజశేఖర్, ఎస్సీ సెల్ అధ్యక్షురాలు సుజాత, మహిళా నాయకులు నజీమా, సనా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి వాస్తవ లాభాలు ప్రకటించి కార్మికులకు 40 శాతం వాటా చెల్లించాలి

- *పీఎల్ఆర్ బోనస్‌ను రూ.1.15 లక్షలకు పెంచాలి.*
- *శ్రీరాంపూర్ ఏరియా జీఎంకు టీఎన్‌టీయూసీ నాయకుల వినతి.*



దశ, బెల్లంపల్లి: సింగరేణి యాజమాన్యం వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించి, అందులో 40 శాతం వాటాను పర్మనెంట్ కార్మికులతో పాటు కాంట్రాక్ట్ కార్మికులకు కూడా చెల్లించాలని సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ టీఎన్‌టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. దీపావళి పండుగకు ముందు చెల్లించే ప్రాఫిట్ లింక్డ్ రివార్డ్ స్కీమ్ (పీఎల్ఆర్) బోనస్‌ను రూ.1.15 లక్షలకు పెంచి అందించాలని కోరారు. ఈ మేరకు గురువారం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి మని రామ్ సింగ్ మాట్లాడుతూ, 2025-26 ఆర్థిక సంవత్సరం ముగిసి ఐదు నెలలు గడుస్తున్నప్పటికీ సింగరేణి యాజమాన్యం వాస్తవ లాభాలను ప్రకటించకపోవడంతో కార్మికుల్లో ఆందోళన నెలకొందన్నారు. సింగరేణి సంస్థ ప్రగతికి కార్మికులే పునాదులని, 2025-26 ఆర్థిక సంవత్సరానికి 60 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్ణయించగా 58 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించారని తెలిపారు. కార్మికుల శ్రమకు తగిన గుర్తింపునిస్తూ వాస్తవ లాభాలను ప్రకటించి, 40 శాతం వాటా చెల్లించే తేదీని వెంటనే ఖరారు చేయాలని డిమాండ్ చేశారు.

గత సంవత్సరం కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5,000 చెల్లించారని, ఈసారి పర్మనెంట్ కార్మికులతో సమానంగా కాంట్రాక్ట్ కార్మికులకు కూడా లాభాల వాటా అందించాలని కోరారు. సింగరేణిలో పెండింగ్‌లో ఉన్న కార్మిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు సొంత ఇంటి పథకాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతన చట్టం ప్రకారం నెలకు రూ.26,000 కంటే తక్కువ కాకుండా వేతనం చెల్లించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కోల్ ఇండియాలో అమలవుతున్న విధంగా సింగరేణిలో కూడా ఫస్ట్ కేటగిరీ వేతనం చెల్లించాలని కోరారు. సీపీఎంఆర్ఎస్ పథకంలో అధికారులు, కార్మికుల మధ్య వ్యత్యాసం లేకుండా రూ.25 లక్షల ప్రయోజనం కల్పించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రిటైర్డ్ కార్మికుల పెన్షన్‌ను పెంచాలని విజ్ఞప్తి చేశారు.

అండర్‌గ్రౌండ్, ఓపెన్‌కాస్ట్ గనుల్లో పనిచేస్తున్న కార్మికులకు సరిపడా పనిముట్లు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. మైన్స్ కమిటీలో కార్మికుల సమస్యలను ప్రస్తావించి పనిముట్లు అందించాల్సిన గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాలు ఆ దిశగా చర్యలు తీసుకోకుండా కేవలం వినతి పత్రాలకే పరిమితం కావడం విచారకరమని విమర్శించారు. గనుల్లో పనిచేస్తున్న కార్మికులకు అవసరమైన పనిముట్లను తక్షణమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోల్ బెల్ట్ ప్రాంత ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. సింగరేణి వాస్తవ లాభాలను ప్రకటించి కార్మికుల వాటాను చెల్లించకపోతే టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో అన్ని జనరల్ మేనేజర్ కార్యాలయాల ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మని రామ్ సింగ్, ఉపాధ్యక్షుడు గద్దెల నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మకాయల ఏడుకొండలు, ఎస్సీ ఎల్‌యూ ఎల్‌యూ నాయకులు తలారి రాజు, కుండి శ్రీనివాస్, పార్లమెంట్ ఆర్గనైజర్ గజ్జల దుర్గయ్య, ఎండీ అన్వర్, రాజబాబు, ఎన్. పుల్లయ్య, ఏ. రాజనర్సు, అంకులు, పేదల టి. మధునయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫతుల్లాగూడ యానిమల్ కేర్ సెంటర్‌లో కమిషనర్ తనిఖీ

ఏబీసీ, యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్‌పై సమీక్ష



దశ, నాగోల్ : మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఫతుల్లాగూడ యానిమల్ కేర్ సెంటర్‌ను కమిషనర్ సందర్శించి ఏబీసీ, యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాలను పరిశీలించారు. వెటర్నరీ అధికారులు, ఫీల్డ్ సిబ్బంది, జంతు సంక్షేమ సంస్థల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. డాగ్ కెన్నెల్స్, ఆపరేషన్ థియేటర్, ఆహారం తయారీ కేంద్రం, నిర్మాణంలో ఉన్న నూతన షెల్టర్‌ను పరిశీలించిన కమిషనర్.. ఆపరేషన్ అనంతర సంరక్షణ, రికార్డుల నిర్వహణ, కెన్నెల్స్, వాహనాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. SOP ప్రకారం ఏఆర్‌వీ నిర్వహిస్తూ వ్యాక్సిన్ల కోల్డ్ చైన్ సక్రమంగా ఉండేలా చూడాలని, శస్త్రచికిత్సలకు ముందు డయాగ్నస్టిక్ పరీక్షల సదుపాయం కల్పించాలని సూచించారు. మల్కాజ్‌గిరి పరిధిలో సుమారు 3,000 జంతువుల సామర్థ్యంతో యానిమల్ షెల్టర్ల అభివృద్ధికి ప్రతిపాదనపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలి

- *ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేసి అర్హులైన ఓటర్ల హక్కును పునరుద్ధరించాలి*



దశ, బెల్లంపల్లి: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిలిపివేసి, ఈ ప్రక్రియలో ఓటు హక్కు కోల్పోయిన అర్హులైన ప్రతి ఓటరుకు తిరిగి ఓటు హక్కు కల్పించాలని వామపక్ష కమ్యూనిస్టు పార్టీలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు సీపీఐ, సీపీఎం, ఎంసీపీఐ(యూ), సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ, సీపీఐ(ఎంఎల్) రెడ్ స్టార్ తదితర వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, సబ్ కలెక్టర్ మనోజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు దాగం మల్లేష్, ఆడెపు రాజమౌళి, దాగం శ్రీకాంత్, పసుపులేటి వెంకటేష్, రెడ్డి చరణ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం అర్హత కలిగిన ప్రతి పౌరుడికి ఓటు హక్కును కల్పించిందన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైన రాజ్యాంగ హక్కు అని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పత్రాల సమర్పణ, ధ్రువీకరణ, చిరునామా మార్పులు, వలసలు, సాంకేతిక సమస్యలు తదితర కారణాలతో అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించే పరిస్థితి ఏర్పడితే ప్రజాస్వామ్య హక్కులపై తీవ్ర ప్రభావం పడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అర్హత కలిగిన ఒక్క ఓటరు కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగించబడకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేసి, ఇప్పటికే ఓటు హక్కు కోల్పోయిన అర్హులైన ఓటర్లకు తిరిగి హక్కు కల్పించాలని కోరారు. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్, పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, సీపీఎం జిల్లా సమితి సభ్యులు దాగం శ్రీకాంత్, ఎంసీపీఐ(యూ) జిల్లా సహాయ కార్యదర్శి పసుపులేటి వెంకటేష్, బొల్లం సోని, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు రెడ్డి చరణ్, భూమయ్య, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి బొల్లం తిలక్ అంబేద్కర్, బీకేఎంయూ జాతీయ సమితి సభ్యులు అక్కెపల్లి బాబు, బెల్లంపల్లి మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, తాండూర్ మండల కార్యదర్శి కొండు బానేష్, బీకేఎంయూ జిల్లా కార్యదర్శి గుండాచంద్ర మాణిక్యం, సీపీఐ జిల్లా సమితి సభ్యులు డీఆర్ శ్రీధర్, మేకల రాజేశం, రత్నం రాజ్యం, బోర్ల సమ్మయ్య, ప్రహ్లాద్, ఆరేపల్లి రమేష్, స్వామిదాస్, కే.తిరుపతి, మహేందర్‌రెడ్డి, అందుగుల రాజేందర్, మేకల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

గచ్చిబౌలి హోటల్‌లో వ్యభిచారం గుట్టురట్టు..

దశ, హైదరాబాద్: గచ్చిబౌలిలోని ఓ హోటల్‌ను కేంద్రంగా చేసుకుని విదేశీ యువతులతో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు గచ్చిబౌలి పోలీసులు గత రాత్రి ఆ హోటల్‌పై దాడి చేసి, నిర్వాహకులతో పాటు ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ముగ్గురు యువతులను అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఢిల్లీకి చెందిన నిఖిల్ ప్రధాన నిర్వాహకుడిగా వ్యవహరిస్తూ, రామ్మోహన్ రెడ్డి అనే వ్యక్తితో కలిసి ఈ అసాంఘిక కార్యకలాపాలను నిర్వహిస్తున్నాడు. పక్కా సమాచారంతో పోలీసులు హోటల్‌పై మెరుపు దాడి నిర్వహించి, నిర్వాహకులు నిఖిల్, రామ్మోహన్ రెడ్డితో పాటు విటుడు హర్షిత్ సింఘానియాను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ముగ్గురు యువతులను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఘటనా స్థలం నుంచి పోలీసులు రూ. 13,000 నగదు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో పట్టుబడిన యువతుల పాస్‌పోర్టులు, వీసాలు చెల్లుబాటులోనే ఉన్నాయని, వారు కొద్ది రోజుల క్రితమే నగరానికి వచ్చినట్లు తేలింది.

వృద్ధుల సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి.



దశ, రంగారెడ్డి: వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కిరణ్మయి సూచించారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని 21 గ్రామీణ మండలాల నుంచి సుమారు 250 మంది వృద్ధ మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో వృద్ధ మహిళలకు బీపీ, షుగర్, థైరాయిడ్, లివర్, కిడ్నీ తదితర పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు అందించారు.

ఈ సందర్భంగా కిరణ్మయి మాట్లాడుతూ.. తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం వృద్ధుల హక్కుల పరిరక్షణలో కీలకమని తెలిపారు. తల్లిదండ్రులు, వృద్ధులను సంరక్షించడం పిల్లల ప్రాథమిక బాధ్యతగా పేర్కొన్నారు. నిర్లక్ష్యం లేదా వేధింపులకు గురైన వృద్ధులు చట్టపరమైన పరిష్కారాలను పొందవచ్చని చెప్పారు. సమస్యల పరిష్కారం కోసం గ్రామపంచాయతీ, మండల అభివృద్ధి అధికారి, మండల రెవెన్యూ అధికారి కార్యాలయాలతో పాటు మండల మహిళా సమాఖ్య లేదా జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. తమ పేరుపై ఉన్న ఆస్తులను తొందరపడి ఇతరుల పేర్లకు బదలాయించవద్దని, ఆస్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పీడీ డీఆర్‌డీఏ శ్రీలత మాట్లాడుతూ అర్హులైన వృద్ధులకు ప్రభుత్వం ప్రతి నెలా సామాజిక భద్రతా పింఛన్లు అందిస్తోందన్నారు. కొత్త పింఛన్ల కోసం స్వీకరించిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులకు మంజూరు చేసే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. కార్యక్రమంలో SERP ప్రతినిధి పద్మ, జిల్లా మహిళా సమాఖ్య ప్రతినిధులు అశ్విని, సునీత, ప్రేమలత, వైద్య ఆరోగ్యశాఖ, సంక్షేమశాఖ, డీఆర్‌డీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అదనపు డీఆర్‌డీఓ జోజప్ప కృతజ్ఞతలు తెలిపారు.



స్వచ్ఛతా కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం కీలకం

గుమ్మనవెల్లిలో 'ఏక్ దిన్, ఏక్ గంట, ఏక్ సాత్' కార్యక్రమం.

దశ, కందుకూరు: స్వచ్ఛతా కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం కీలకమని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కే. కిరణ్మయి అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం కందుకూరు మండలం గుమ్మనవెల్లి గ్రామపంచాయతీలో 'ఏక్ దిన్, ఏక్ గంట, ఏక్ సాత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, సిబ్బంది, గ్రామస్థులతో కలిసి శ్రమదానం నిర్వహించి గ్రామ పరిసరాలను శుభ్రపరిచారు. ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేయడంతో పాటు సిగ్నేచర్ క్యాంపెయిన్ నిర్వహించారు.

'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో భాగంగా గ్రామంలో మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతను ప్రజలు తీసుకోవాలని అధికారులు సూచించారు. నాలుగు రకాల వ్యర్థాల వేర్పాటు (ఫోర్‌వే వేస్ట్ సెగ్రిగేషన్)పై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. వ్యర్థాలను మూలంలోనే వేరు చేసి, సరైన విధంగా నిర్వహించడం ద్వారా పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన గ్రామాలను నిర్మించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, సీఈఓ కృష్ణారెడ్డితో పాటు జిల్లా, మండల స్థాయి అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

వామ్మో.. కుక్కకాటు

- ఒక్కరోజే తాండూర్ లో 9,పరిగిలో 16 మంది, కొడంగల్ లో ఆరుగురిపై కుక్కల స్వైర విహారం
- పరిగి, తాండూరు ఆసుపత్రులలో కుక్క కాటుకు మందులు కరువు
- మందులు లేక వికారాబాద్, హైదరాబాద్ కీ తరలింపు
- నెలన్నరలో 400లకు పైగా కుక్కకాటు కేసులు నమోదు

తాండూర్, దశ ప్రతినిధి: పరిగి ప్రాంతంలో ఇటీ వల కుక్కకాట్లు పెరగడం ఆందోళన కలిగిస్తున్నది. గత నెలలో 250 కుక్కకాటు కేసులు నమోదైనట్లు సమాచారం.అలాగే ఈ నెల ప్రారంభం నుంచి పక్షం రోజుల వ్యవధిలో 158 కుక్కకాటు కేసులు నమోదైనట్లు తెలిసింది. ఈ లెక్కన రోజుకు కనీసం పది వరకు కుక్కకాటు కేసులు నమోదవుతున్నాయంటే పరిస్థితి ఎలా ఉన్నదో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.


ఆది వారం పరిగి మున్సిపల్ పరిధిలో 16 మందిపై కుక్కలు దాడిచేశాయి. పట్టణంలోని ఖాన్ కాలనీ, మార్కెట్ యార్డులోనే 9 మంది కుక్క కాటుకు గురయ్యారు. దీంతో వారందరు పరిగిలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లగా ప్రాథమిక చికిత్స జరిపారు. కొందరికి తీవ్రమైన కాటు వల్ల ఇవ్వాల్సిన మందులు అందుబాటులో లేకపోవడంతో తాండూరుకు రెఫర్ చేశారు.

విషయం తెలుసుకున్న మున్సిపల్ మాజీ చైర్మన్ ముకుంద అశోక్, మాజీ ఎంపీపీ అరవిందరావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బి.ప్రవీణ్ కుమార్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎస్. భాస్కర్ తదితరులు పరిగి ఆసుపత్రికి వెళ్లి మందుల విషయమై డాక్టర్ను అడుగగా, తమ వద్ద అందుబాటులో లేవని చెప్పడంతో మండిపడ్డారు. ఉన్నతాధికారులను సైతం సంప్రదించగా వారు నిర్లక్ష్యంగా మాట్లాడారని వారు తెలిపారు. అనంతరం కుక్కకాటుకు గురైనవారిని తాండూరు ఆసుపత్రికి తరలించగా.. అక్కడ కూడా మందులు లేకపోవడంతో వికారాబాద్ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

అక్కడ బాధితులకు బీఆర్ఎస్ నాయకులు దగ్గరుండి వైద్యం చేయించారు. కుక్కకాటు బాధితులకు ఏఆర్వీ వ్యాక్సిన్ ఇచ్చామని ఆసుపత్రి ఇన్చార్జి డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. కుక్కకాటుతో మాంసం బయటపడితే తప్పా ఇతర మందులు అవసరం లేదన్నారు. వాటిని సైతం తెప్పి స్తామని చెప్పడం గమనార్హం.

సర్వత్రా విమర్శలు

కుక్కకాటు తీవ్రంగా ఉన్నప్పటికీ ఇవ్వ ల్సిన



మందులు అందుబాటులో ఉంచక పోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. రోజుకు సుమారు 10 కుక్కకాటు కేసులు నమోదవుతున్న తరుణంలో సైతం వైద్యాధికారులు ముందస్తు చర్యలు చేపట్టకపోవడం విడ్డూరం. తీవ్రమైన కుక్కకాటుకు ఇవ్వాల్సిన మందులు అందుబాటులో ఉంచకపోవడం సరైంది కాదని పలువురు పేర్కొంటున్నారు. పరిగి పట్టణంలో వీధికుక్కలను నివారించడంలో మున్సిపల్ అధికారులు విఫలమయ్యారనే విమర్శలు బాహాటంగా వినిపిస్తున్నాయి. కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోతుండగా వాటికి టీకాలు ఇప్పించడం లేదా, కు.ని. ఆపరేషన్ చేయించాలని పేర్కొంటున్నారు. యాంటీ రేబిస్ వ్యాక్సిన్ ఇప్పిస్తే తప్ప ఈ కుక్కకాటు నుంచి రక్షణ లేదని, మున్సిపల్ అధికారులు ఈ దిశగా చర్యలు చేపట్టాలన్నారు.

కొడంగల్ లో

మండలకేంద్రంలో ఓ వీధికుక్క స్వైరవిహారంచేసి ఏకంగా ఆరుగురిపై దాడి చేసి గాయపరిచింది. ఆదివారం ఉదయం మున్సిపల్ కార్యాలయానికి ఉద్యోగి అనంతప్ప విధులకు హాజరయ్యేందుకు వచ్చాడు. క్రమంలో ఆయనపై ఓ వీధి కుక్క దాడి చేసి గాయపరిచింది. ఒక్కరితో ఆగ కుండా మరో ఐదుగురిపై కూడా దాడి చేసింది. అప్రమత్తమైన మున్సిపల్ సిబ్బంది వెంటనే గాయపడినవారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించిన అనంతరం మెరుగైన చికిత్స కోసం కొంత మందిని హైదరాబాద్కు తరలించారు. దాడికి పాల్పడిన కుక్కను మున్సిపల్ సిబ్బంది పట్టుకొని బంధించారు. మున్సిపల్ పరిధిలోని వీధుల్లో వీధి కుక్కల బెడద అధికంగా మారిందని, గత నాలుగు నెలల క్రితం మున్సి పల్ సిబ్బంది వీధి కుక్కలను పట్టుకునే ప్రక్రియను చేపట్టారని.. కానీ ప్రస్తుతం ఆ పని చేయడం లేదని ప్రజలు వాపోయారు. చిన్న పిల్లలు వీధుల్లో తిరగాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొన్న దాని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా పరిస్థితిని గుర్తించి వీధి కుక్కల బెడదలను నివారించే దిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

హైదరాబాద్‌లో ఏబీఆర్ఎస్ఎం జాతీయ కార్యవర్గ సమావేశం

- నాగోల్‌లో అక్టోబర్ 3న 'శిక్షా భూషణ్' సన్మాన కార్యక్రమం





దశ ఓయూ: అఖిల భారతీయ రాష్ట్రియ శైక్షిక్ మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ఎం) జాతీయ కార్యవర్గ సమావేశం హైదరాబాద్‌లో అక్టోబర్ 2 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి ఆర్ఎస్ఎస్ సహ సర్కార్యవాహ్ శ్రీ ముకుంద సి.ఆర్. ముఖ్య అతిథిగా హాజరుకానుండగా.. ఏబీఆర్ఎస్ఎం జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ నారాయణ్‌లాల్ గుప్తా అధ్యక్షత వహించనున్నారు. అక్టోబర్ 3న సాయంత్రం 5.30 గంటలకు నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ సెంటర్‌లో 'అఖిల భారతీయ శిక్షా భూషణ్ సన్మాన్ సమారోహ్' నిర్వహించనున్నారు. విద్యారంగానికి విశిష్ట సేవలు అందించిన మాజీ యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ ఎం. జగదీశ్ కుమార్, ఐఐఎం బెంగళూరు మాజీ ప్రొఫెసర్, డీన్ ప్రొఫెసర్ బి. మహాదేవన్, విజ్ఞాన విహార ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మాజీ ప్రిన్సిపాల్ డి. రామకృష్ణరావును సన్మానించనున్నారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామీజీ ప్రత్యేక ఆశీస్సులు అందించనున్నారు. కార్యక్రమానికి ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, ప్రొఫెసర్లు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు.

అక్టోబర్ 6న ఛలో హైదరాబాద్

- ఎంఎస్ఎఫ్ జాతీయ ప్రతినిధుల సదస్సును విజయవంతం చేయాలి



దశ ఓయూ: ఉస్మానియా యూనివర్సిటీలో అక్టోబర్ 6న నిర్వహించనున్న మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) జాతీయ ప్రతినిధుల సదస్సును విజయవంతం చేయాలని ఎంఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు డా. చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. కొమ్ము శేఖర్ మాదిగ పిలుపునిచ్చారు. సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను గురువారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు విశ్వవిద్యాలయాలు, సంక్షేమ హాస్టళ్లు, కళాశాలలు, జిల్లా, మండలాల నుంచి ఎంఎస్ఎఫ్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. సదస్సుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. వర్గీకరణ అనంతరం జరుగుతున్న తొలి జాతీయ ప్రతినిధుల సదస్సు ఇదేనని పేర్కొన్నారు. మాదిగ విద్యార్థులు విద్యారంగ సమస్యల పరిష్కారంతో పాటు సమసమాజ స్థాపన, మాదిగ జాతి అభివృద్ధి కోసం ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ నూతన ఓయూ అధ్యక్షుడు గద్దెపోగు మధుసూదన్ మాదిగ, నాయకులు డా. పల్లెర్ల సుధాకర్ మాదిగ, విరపాకుల పరుశురాం మాదిగ, బిక్కి మురళీకృష్ణ మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు దుప్పెల్లి అనిల్ మాదిగ, జనపాల మహేష్ మాదిగ, చెడిపల్లి రఘుపరన్ మాదిగ, దావు ఆదిత్య మాదిగ, మంద రాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉచిత అల్పాహార కార్యక్రమం ప్రారంభం

దశ ఓయూ: ప్రాథమిక విద్యను బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, ఆరోగ్యం, పోషకాహారం మరియు అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పూర్వ ప్రాథమిక (ప్రీ ప్రైమరీ) తరగతులను ప్రారంభిస్తున్న విషయం తెలిసిందే.

ఈ నేపథ్యంలో మారేడుపల్లి మండలం ఆర్యవాటిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం ఉదయం విద్యార్థులకు ఉచిత అల్పాహారం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని మారేడుపల్లి మండల డిప్యూటీ ఐఓఎస్ శ్రీ ఎల్. రామలింగారెడ్డి ప్రారంభించి, విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు.

ఈ సందర్భంగా శ్రీ రామలింగారెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం అందించడం వారి సమగ్ర అభివృద్ధికి ఎంతో అవసరమని అన్నారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు పెరగడానికి, పిల్లలు ఉత్సాహంగా పాఠశాలకు రావడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు.

పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్. మంజుల మాట్లాడుతూ, "పిల్లల ఆరోగ్యం, పోషకాహారం మరియు విద్య పరస్పరం అనుసంధానమై ఉన్నాయి. ఉదయం పూట పిల్లలకు పౌష్టికమైన అల్పాహారం అందించడం వల్ల వారు ఉత్సాహంగా తరగతులకు హాజరై, చదువుపై మరింత శ్రద్ధ పెట్టేందుకు అవకాశం ఉంటుంది.

పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరు కావడం కూడా పిల్లల విద్యాభివృద్ధిలో కీలకమైన అంశం" అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, పూర్వ ప్రాథమిక తరగతులు, ఉచిత అల్పాహారం వంటి కార్యక్రమాలు పిల్లల పట్ల ప్రభుత్వం తీసుకుంటున్న శ్రద్ధకు నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల సహ ఉపాధ్యాయినులు మంజుల, అనురాధ, పద్మావతి, కళ్యాణి, సీఆర్పీ మనోహర,అలాగే బ్లూ ఫౌండేషన్ నిర్వాహకులు క్రాంతి కిషోర్ పాల్గొన్నారు.

బీసీ స్మశాన వాటికలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



తాండూర్, దశ ప్రతినిధి: తాండూర్ నియోజకవర్గ పరిధిలోని అన్ని బీసీ స్మశాన వాటికలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామని తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. తాండూర్ పట్టణంలోని ప్రధాన బీసీ స్మశాన వాటికలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..

తాండూర్ పట్టణంలోని ప్రధాన బీసీ స్మశాన వాటిక అభివృద్ధి కోసం ఇప్పటికే రూ.10 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు స్మశాన వాటికలను పరిశుభ్రంగా,సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.అలాగే పాత తాండూర్‌లోని 14వ వార్డ్ బోనమ్మ టెంపుల్ సమీపంలో స్మశాన వాటికలో ఏడాది క్రితమే బోర్ వేయించి నీటి సదుపాయం కల్పించడంతో పాటు, కంపౌండ్ వాల్ నిర్మాణం కోసం రూ.10 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు,త్వరలోనే ఆ పనులను ప్రారంభించి పూర్తి చేస్తామని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి వెల్లడించారు.తాండూర్ నియోజకవర్గంలోని బీసీ స్మశాన వాటికలకు అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా కల్పించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాకేష్, కౌన్సిలర్లు, బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ లో 36వేల నకిలీ ఓట్లు

తాండూర్, దశ ప్రతినిధి: తెలంగాణాలో ఓటర్ల జాబితాలో భారీగా అవకతవకలు జరిగాయని, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 16 లక్షల నకిలీ ఓట్లు ఉన్నాయని బీఆర్ఎస్ పార్టీ సంచలన ఆరోపణలు చేసింది. ఈ మేరకు బీఆర్ఎస్ ప్రతినిధి బృందం ఢిల్లీలోని నిర్వాచన్ సదన్లో కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) అధికారులకు ఫిర్యాదు చేసింది. రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో దాదాపు 36 వేల నకిలీ ఓట్లు ఉన్నాయని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత వద్దిరాజు రవిచంద్ర ఫిర్యాదు చేశారు.

ఈ నకిలీ ఓట్ల వ్యవహారంపై సమగ్ర విచారణ జరగాలని ఆయన డిమాండ్ చేశారు. గత ఎన్నికల్లో రేవంత్ రెడ్డి ఇక్కడి నుంచే 32 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. 20152025 మధ్య కాలంలోనే ఈ నియోజకవర్గంలో 30 వేలకు పైగా కొత్త ఓట్లు అక్రమంగా చేర్చినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎస్సీఆర్ ప్రక్రియలో భాగంగా, తమ పార్టీకి చెందిన బీఎల్ఎల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో ఆడిట్ నిర్వహించామని వద్దిరాజు తెలిపారు. దీని ప్రకారం, ప్రతి నియోజకవర్గంలో సగటున 16,600 నకిలీ ఓట్లు ఉన్నాయని తేలిందన్నారు. ముఖ్యంగా సరిహద్దు రాష్ట్రాల నుంచి, ముఖ్యంగా కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లోని ఓటర్లను తెలంగాణ ఓటర్లుగా అక్రమంగా నమోదు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానే శ్రీకుమార్, కమిషనర్ డాక్టర్ వివేక్ జోషిలను బీఆర్ఎస్ బృందం కలిసింది.

ఈ బృందంలో వద్దిరాజు రవిచంద్రతో పాటు మాజీ ఎంపీ బి. వినోద్ కుమార్, పార్టీ ప్రధాన కార్యదర్శి సోమ భరత్ కుమార్ ఉన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ రాష్ట్రంలో చాలా నెమ్మదిగా సాగుతోందని, లోపాలను సరిదిద్దడానికి గడువును మరో రెండు నెలలు పొడిగించాలని, ప్రజాప్రాతినిధ్య చట్టం సెక్షన్ 17, 18, 62 ప్రకారం ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండేలా చూడాలని,అంతరాష్ట్ర ఓట్లను గుర్తించే సాంకేతికతను మెరుగుపరచాలని విజ్ఞప్తిచేశారు.దేశవ్యాప్త ఓటర్ల జాబితా ప్రక్షాళన జరగాలంటే, ఈ సరిహద్దు ఓటర్ల సమస్యను పరిష్కరించడం అత్యవసరమని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు.

నాచారం పోలీసుల వలలో గంజాయి ముఠా

- 4 కిలోల గంజాయి స్వాధీనం.. ముగ్గురు అరెస్ట్

దశ ఓయూ: గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను నాచారం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు 4 కిలోల గంజాయి, ఓ ద్విచక్ర వాహనం, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సెప్టెంబరు 30న నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయిని తరలించి విక్రయించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. పీసీఓ 12842 ఎస్. రంజిత్‌కుమార్ అందించిన సమాచారంతో ప్రత్యేక బృందం రంగంలోకి దిగి అనుమానితుల కదలికలను గమనించి పట్టుకుంది. అరెస్టైన వారిని ఒడిశాకు చెందిన దేవి ప్రసాద్ త్రిపాఠి (23), కృష్ణ సాహు (23), శిబ ప్రసాద్ మహారాణా (23)గా గుర్తించారు. వీరు వరుసగా జొమాటో, జెప్టో డెలివరీ బాయ్‌లుగా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద ఉన్న నీలం రంగు సూట్‌కేసులో సుమారు 4 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తరలించేందుకు ఉపయోగించిన టీవీఎస్ ఎన్‌టార్క్ ద్విచక్ర వాహనం (OD07AN8113), రియల్‌మీ, గూగుల్ పిక్సెల్, ఒప్పో ఫోన్లను సీజ్ చేశారు.

చౌటుప్పల్‌లో 'స్వచ్ఛత హీ సేవా' కార్యక్రమం

- పారిశుధ్య కార్మికులతో కలిసి శ్రమదానం చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్‌గౌడ్

దశ, చౌటుప్పల్: దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'స్వచ్ఛత హీ సేవా-2026' కార్యక్రమంలో భాగంగా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో గురువారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. నాగులకుంట సమీపంలోని షాదీఖానా నాలాలో చేపట్టిన ఈ శ్రమదాన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్‌గౌడ్ స్వయంగా పాల్గొని పారిశుధ్య కార్మికులను ఉత్సాహపరిచారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో నాలాలో పేరుకుపోయిన ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ బాటిళ్లు, చెత్తాచెదారం, ఇతర ఘన వ్యర్థాలను పారిశుధ్య సిబ్బంది తొలగించారు. మురుగునీరు, వర్షపు నీరు నిలిచిపోకుండా సాఫీగా ప్రవహించేలా నాలాను పూర్తిగా శుభ్రం చేశారు.

ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్‌గౌడ్ పారిశుధ్య కార్మికులతో కలిసి పనిచేస్తూ వారిని ప్రోత్సహించారు. పట్టణ పరిశుభ్రతలో పారిశుధ్య కార్మికుల సేవలు ఎంతో కీలకమని పేర్కొంటూ, ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. శ్రమదాన కార్యక్రమాల్లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని సామాజిక బాధ్యతను చాటుకోవాలని కోరారు. గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించే స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకురావాలని చైర్‌పర్సన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బత్తుల దాను, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రేణుకుమార్, జవాన్ నరసింహ, మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది, స్థానికులు బీఎస్ఎన్ఎల్ నరసింహ, పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజర్ స్వప్న, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించాలి

- బీసీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఓయూలో నిరసన.. బీసీలకు ఒక ఎమ్మెల్సీ సీటు కేటాయించాలని డిమాండ్



దశ ఓయూ: పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో జనాభా ప్రాతిపదికన బీసీలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బీసీ విద్యార్థి సంఘాలు, పరిశోధక విద్యార్థులు నిరసన చేపట్టారు. అనంతరం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మనబోయిన సైదులు యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ..బీసీలకు సామాజిక న్యాయం చేస్తామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం, రాజకీయ ప్రాతినిధ్యం విషయంలో మాత్రం జాప్యం చేస్తోందని ఆరోపించారు.

బీసీ కులగణన నిర్వహించామని ప్రకటిస్తున్న ప్రభుత్వం..బీసీలకురాజకీయంగా 42శాతంరిజర్వేషన్లు అమలు చేయడంలో ఎందుకు జాప్యం చేస్తోందో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన బీసీలకు ఒక సీటు కేటాయించాలని కోరారు. బీసీ మేధావులు, విద్యార్థులు, పట్టభద్రులు తమ హక్కులు, రిజర్వేషన్ల కోసం ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. బీసీలకు ఎమ్మెల్సీ టికెట్ కేటాయించకపోతే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో AIOBCSA విద్యార్థి నాయకుడు మహేష్ గౌడ్, అడ్వకేట్ శ్రవణ్ యాదవ్, MSF జాతీయ ఉపాధ్యక్షుడు తోకల చిరంజీవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూక మధు యాదవ్, JVS రాష్ట్ర అధ్యక్షుడు చీరాల వంశీ, రజక విద్యార్థి సంఘం నాయకులు వంశీ, రఘు, ఓయూ విద్యార్థి నాయకులు సాయి కిరణ్, చిందం మధు యాదవ్, ప్రవీణ్, మనోజ్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.